సాక్షి
ప్రకాశం
శుక్రవారం : 20 : డిసెంబర్ : 2024



పారిశుధ్యంపై దృష్టి సారించాలి

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. - 8లో..



రావొద్దమ్మా..ఇట్లు మీ గుండ్లకమ్మ

గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. పర్యాటకులు ఉండేందుకు నిర్మించిన కాటేజీలు దెబ్బతిన్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
27/23

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కొర్రపాటివారిపాలెం కొండ పరిశీలన


కొర్రపాటివారిపాలెం గ్రామంలో విచారణ చేపడుతున్న ఆర్డీఓ లక్ష్మీప్రసన్న

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలోని కొండను తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో 'కొండను మింగిన అనకొండ' శీర్షికన ఈ నెల 18 న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, స్థానిక తహసీల్దార్ సంజీవరావు గురువారం కొండను పరిశీలించి గ్రామంలో విచారణ చేపట్టారు. కొర్రపాటివారిపాలెం గ్రామ ప్రజల జీవాలకు ఆధారమైన కొండను అక్రమంగా తవ్వేయడంపై గ్రామ ప్రజలతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. పశువులకు ప్రధాన జీవనాధారమైన కొండను అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. అయితే గ్రామస్తులు కలుగజేసుకుని పూర్తి స్థాయిలో పరిష్కారం దొరక్కపోతే మా పోరాటాన్ని ఇలాగే కొనసాగిస్తామని గ్రామస్తులు ఆర్డీఓ ముందు భీష్మించారు. గ్రామప్రజలకు అండగా ఉండి, తగు న్యాయం చేస్తామని ఆర్డీఓ లక్ష్మీప్రసన్న హామీ ఇచ్చారు. దీంతో వారు నిరసన విరమించుకున్నారు. ఆమె వెంట సీఐ వై రామారావు, ఎస్ఐ మల్లికార్జునరావు, డీటీ ఇమ్మానియేల్‌రాజు గ్రామస్తులు ఉన్నారు.

యువత వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

- స్టెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ

ఒంగోలు సిటీ: యువత తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని స్టెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ అన్నారు. గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, మాదక ద్రవ్యాల నిర్మూలనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏడుకొండలు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● చోర్..చోర్

నిద్దరోతున్న నిఘా





జిల్లాలో ఎక్కడ చూసినా దొంగతనాలు జరుగుతున్నాయి. రాత్రయితే చాలు దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు రెక్కీ చేయడం, రాత్రి కన్నం వేయడం నిత్యకృత్యమైపోయింది. ఇంటికి తాళాలు వేసి ఉంటే చాలు తెల్లారేసరికల్లా ఇంట్లో నగదు, నగలు మాయమైపోతున్నాయి. దుకాణాలను కూడా వదిలి పెట్టడం లేదు. ఒకవైపు దొంగతనాలు జరుగుతున్నా అరికట్టని పోలీసులు.. సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టారంటూ అడ్డగోలు కేసులు వేయించిన అధికార పార్టీ నేతల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- జిల్లాలో జోరుగా దొంగతనాలు
- ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట చోరీకి పాల్పడుతున్న దొంగలు
- శాంతి భద్రతల కంటే కక్షసాధింపు చర్యలపైనే పోలీసుల దృష్టి
- రాత్రివేళ గస్తీ నిల్

ఒంగోలు టౌన్: జిల్లాలో దొంగల బెడద పెరిగిపోయింది. నిత్యం ఒక్కడో ఒక చోట దొంగతనం జరుగుతూనే ఉంది. ఇటీవల ఒకే రోజు పొదిలిలో రెండు దుకాణాల్లో దొంగలు పడి దోచుకెళ్లారు. కంభంలో ఒకేరోజు మూడు దుకాణాల్లో దొంగలు పడ్డారు. ఒంగోలులోని రద్దీ ప్రాంతంలో ఒక హోటల్లో దొంగలు పడ్డారు. అలాగే ఒక ఇంట్లో దొంగలు పడి భారీగా దోచుకెళ్లారు. ఇలా ప్రతి రోజు దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి.

రద్దీ ప్రాంతాల్లో చోరీలతో ప్రజల్లో ఆందోళన:

ఎక్కడో ఊరి బయట దొంగలు పడ్డారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు పడుతున్నారు. నగరం నడిబొడ్డున దర్జాగా చోరీలకు తెగబడుతున్నారు. పొదిలిలోని విశ్వనాథపురంలో ఆర్టీసీ బస్టాండు, దానికి సమీపంలోనే సినిమా హాలు ఉంది. దీంతో అక్కడ ఎప్పుడు చూసినా జనాలు తిరుగుతూనే ఉంటారు. అలాంటి చోట దొంగలు పడ్డారు. ఒకే రోజు రెండు దుకాణాల షెట్టర్లను పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. కోటి అనే వ్యక్తికి చెందిన దుకాణంలో ఏకంగా రూ.5 లక్షలు ఎత్తుకెళ్లారు. షఫి అనే వ్యక్తి దుకాణంలో కేవలం రూ.3 వేలు ఉంటే అవీ తీసుకెళ్లారు. అలాగే ఒంగోలులో కూడా రద్దీ ప్రాంతంలో దొంగలు పడడం సంచలనం సృష్టించింది. నగరంలోని అద్దంకి బస్టాండు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇక్కడ ప్రైవేటు బస్సు ఏజన్సీలు ఉన్నాయి. అంతటి రద్దీ ప్రాంతంలో దొంగలు పడ్డారు. అద్దంకి బస్టాండ్‌లోని బిలాల్ హోటల్ రాత్రి 11 గంటల వరకు ఉంటుంది. ఆ తరువాత మూసివేసి వెళ్లిన నిర్వాహకులు మరుసటి రోజు ఉదయం వచ్చి చూసే బీరువా తెరచి ఉంది. వెనక తలుపులు పెకిలించి ఉండడంతో దొంగలు పడినట్లు నిర్ధారించుకున్న హోటల్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బంగారం దుకాణాలే టార్గెట్:

ఇదిలా ఉండగా బంగారం దుకాణాలను టార్గెట్‌గా చేసుకొని కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత నెల 21వ తేదీ చీమకుర్తిలోని సీఎస్ఎన్ బంగారు దుకాణంలో పట్టపగలే దొంగలు చోరీకి తెగబడ్డారు. బంగారు ఉంగరం కావాలంటూ ఒక యువకుడు దుకాణానికి వచ్చాడు. కొన్ని రకాల మోడళ్లు చూపించాలని కోరాడు. ఒక ట్రేలో కొన్ని బంగారు ఉంగరాలు తీసుకొచ్చి చూపిస్తుండగా దుకాణదారునితో మాటలు కలిపాడు. రెండో కంట పడకుండా ట్రేలో ఉన్న బంగారు నగలను జేబులో వేసుకుని జారుకున్నాడు. అలాగే డిసెంబర్ 2వ తేదీ తాళ్లూరు మండలంలో తెలంగాణకు చెందిన తల్లీకూతుళ్లు ఒక బంగారు దుకాణంలో చోరీ చేసి పట్టుబడ్డారు. మండలంలోని తూర్పు గంగారంలో విష్ణు జ్యూయలరీలో చెవి కమ్మలు కావాలంటూ వచ్చిన ఆ జంట దొంగలు యజమాని కళ్లుగప్పి 6 జతల కమ్మలు తస్కరించారు. వాటి స్థానంలో తన వద్ద ఉన్న రోల్డ్‌గోల్డ్ కమ్మలను ఉంచారు. ఆ తరువాత ఈ విషయాన్ని గమనించిన దుకాణ యజమాని పోలీసులను ఆశ్రయించాడు.

మోటారు బైకుల్లో పెట్రోలు... ఫ్రిజ్‌లో కూల్‌డ్రింక్స్‌లను కూడా...

కంభం గ్రామంలో ఒకే రోజు మూడు దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అర్బన్ కాలనీలోని సయ్యద్ మహబూబ్‌కు చెందిన దుకాణంలో తాళం పగులగొట్టి చేతికి అందిన వస్తువులను దోచుకెళ్లారు. చోరీ చేసి పోతూ పోతూ దారిలో కనిపించిన మోటారు బైకుల నుంచి పైపులు పీకేసి పెట్రోలు తీసుకెళ్లారు. అదేరోజు రాత్రి కందులాపురం పంచాయతీ పరిధిలోకి వచ్చే తర్లుపాడు రోడ్డులోని ఒక చిల్లర దుకాణం తాళాలు పగులగొట్టి రూ.8,500 నగదును తస్కరించారు. అంతేకాకుండా ఫ్రిజ్‌లో ఉంచిన కూల్ డ్రింక్స్‌ను కూడా వదిలి పెట్టలేదు. దాని పక్కనే ఉన్న అల్లూరయ్య అనే వ్యక్తికి చెందిన వెల్డింగు షాపులో కూడా ఇదే తరహాలో దోపిడీకి పాల్పడ్డారు. ఒకేరోజు రాత్రి మూడు దుకాణాల్లో చోరీ జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

యర్రగొండపాలెంలో దొంగల్లుడు

యర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాల గ్రామానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్న ముండ్ల రామయ్య కొద్దిరోజులుగా అత్తారింట్లోనే ఉంటున్నాడు. బెట్టింగులకు అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. జల్సాలకు చేతిలో డబ్బులు లేకపోవడంతో దొంగగా మారాడు. గ్రామస్తులు పనుల కోసం వెళ్లడం గమనించిన అతడు తీరిగ్గా రోజుకు నాలుగు ఇళ్ల చొప్పన ఎంపిక చేసుకొని దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. కేవలం మూడు రోజుల్లో 12 ఇళ్లకు కన్నం వేసి రూ.7 లక్ష వరకు దోచుకున్న రామయ్య మూడో కంటికి తెలియకుండా ఊరు వదిలి పారిపోయాడు.

నిద్రపోతున్న పోలీసుల గస్తీ:

జిల్లాలో జరుగుతున్న దొంగతనాలను గమనిస్తే పోలీసుల గస్తీ ఏమైందన్న ప్రశ్నలు ఉత్పన్నం కాక మానదు. కంభంలో జరిగిన దొంగతనాలు దొంగలు తీరిగ్గా చేసినట్లు తేటతెల్లం అవుతోంది. అర్బన్ కాలనీలో దుకాణంలో చోరీ చేసిన దొంగలు ఆ తరువాత మోటారు బైకుల నుంచి పెట్రోలు దొంగలించారంటే అదే ప్రాంతంలో చాలా సేపు గడిపినట్లు తెలుస్తోంది. 6 నెలలుగా జిల్లాలో చోరీలు పెరిగిపోయాయి. రాత్రి 10 గంటల తరువాత ఎక్కడా పోలీసులు కనిపించడంలేదు. అసలే చలికాలం కావడంతో ప్రజలు ముసుగుతన్ని ఇళ్లలో పడుకుంటున్నారు. దానికి తోడు పోలీసుల గస్తీ లేకపోవడంతో దొంగలకు అలుసుగా మారిందన్న విమర్శలు వినవస్తున్నాయి.


కంభం మండలం అర్బన్ కాలనీలో దొంగతనం జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం (ఫైల్)

దొంగలు బాబోయ్ దొంగలు:

జిల్లాలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని అన్నవరప్పాడు మొదటిలైనులో నివాసం ఉండే సూరేపల్లి వెలుగొండరావు నరసరావుపేటలో బంధువుల ఇంట్లో జరుగుతున్న ఒక శుభకార్యానికి ఈ నెల 5వ తేదీ వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూస్తే బీరువా తాళం పగులగొట్టి లోపల దాచి ఉంచిన 200 గ్రాముల బంగారు నగలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. దీని విలువ రూ.16 లక్షల వరకు ఉంటుంది. గత నెలలో నగరంలోని గాంధీనగర్ 4వ లైనులో సినీఫక్కీలో దొంగతనం జరిగింది. సాయంత్రం కామేపల్లి సుబ్బ రత్తమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు ఇంటి బయట అరుగు మీద కూర్చొని ఉన్నారు. అటుగా బురఖాలో వచ్చిన ఒక వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. ఏమరుపాటులో ఉన్న ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. అప్పటికే అక్కడ మరోవ్యక్తి మోటారు బైకు మీద వేచి చూస్తున్నట్లు సీసీ కెమెరాల్లో కనిపించింది. మద్దిపాడు మండలంలో పెద్ద కొత్తపల్లికి చెందిన కాటా భారతి గత నెల 8వ తేదీ బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లారు. తిరిగి ఈ నెల 2వ తేదీ ఊరికి వచ్చి చూస్తే బీరువాలో దాచి ఉంచిన 5.5 సవర్ల బంగారు గొలుసు, సవర విలువ చేసే రెండు ఉంగరాలతో పాటుగా రూ.30 వేల నగదు మాయమైంది. మొత్తం రూ.3.5 లక్షలు చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోజుల తరబడి హైదరాబాద్‌లో ఇద్దరు ఎస్ఐలు:

అసలే జిల్లాలో చోరీలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అయినా సరే మాకేవీ పట్టవన్నట్లున్నారు పోలీసు ఉన్నతాధికారులు. ఎప్పుడో సోషల్ మీడియాలో ఏదో కామెంట్ చేశారని ఇప్పుడు పోలీసులు హడావుడి చేయడం విమర్శల పాలవుతోంది. వైజాగ్, హైదరాబాద్, సత్తెనపల్లి, చిలకలూరిపేటలకు సోషల్ మీడియా కేసులపై పోలీసులను తిప్పడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ కోసం మద్దిపాడు, నాగులుప్పలపాడు ఎస్ఐలను రోజుల తరబడి హైదరాబాద్ చుట్టూ తిప్పడం జనానికి విస్మయం కలిగించింది. ఇప్పటికైనా జిల్లాలో జరుగుతున్న చోరీలను అరికట్టి భద్రత, భరోసా కల్పించాలని జనం కోరుతున్నారు.

రోశయ్య విగ్రహం ఫౌంటేన్ తొలగింపు

- మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహంపై కుతంత్రం
- అక్కడ నుంచి తొలగించేందుకు రంగం..
- తొలుత విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్‌ను తొలగించిన నగర పాలక సంస్థ


కొణిజేటి రోశయ్య విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్ (ఫైల్)


అర్ధరాత్రి ఫౌంటేన్ తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని తొలగించే కుట్రకు టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దలు పూనుకున్నారు. అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ విగ్రహం వెనుక ఉన్న ఎన్టీఆర్ విగ్రహం సరిగా కనపడదన్న కారణంతో రోశయ్య విగ్రహాన్ని తొలగించాలన్నది కూటమి ప్రభుత్వ పెద్దల ఆలోచన. అందుకోసం ఇటీవల జరిగిన ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో టీడీపీకి చెందిన డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అలియాస్ బుజ్జి ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న రోశయ్య విగ్రహాన్ని తొలగించాలని కౌన్సిల్‌లో ప్రస్తావించాడు. వేలు వంక పెడితే కానీ వెన్నపూస రాదన్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రోశయ్య సామాజిక వర్గానికి చెందిన డిప్యూటీ మేయర్ చేతనే ఆ విషయాన్ని కౌన్సిల్‌లో ప్రస్తావించేలా పథక రచన చేసినట్లు విశ్వసనీయ సమాచారం. విగ్రహం ఏర్పాటు చేసిన సమయంలో కొణిజేటి రోశయ్య సామాజిక వర్గానికే చెందిన డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ వైఎస్సార్‌సీపీలోనే ఉన్నాడు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచారు. విగ్రహ నిర్మాణ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం అని అప్పుడు తెలియలేదా అని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోయిన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీలో చేరేసరికి వేమూరి సూర్యనారాయణకు ట్రాఫిక్ సమస్య గుర్తుకు వచ్చిందా అంటూ నిలదీస్తున్నారు. అప్పట్లో కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసిమరీ రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదే కౌన్సిల్ ఇప్పుడూ కొనసాగుతోంది. అంటే పార్టీ మారేసరికి విధివిధానాలు కూడా మారిపోయాయి. ఒంగోలు నగరంలోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్‌ను గురువారం ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. తొలుత రోశయ్య విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్‌ను తొలగించి ఆ తరువాత విగ్రహాన్నే తొలగించే కుట్రలు కూటమి ప్రభుత్వంలోని నాయకులు పన్నుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఒంగోలు నడిబొడ్డున ఆర్యవైశ్యుల షాపులతో దేశంలోనే అతి పెద్ద రెండో మార్కెట్ కాంప్లెక్స్‌ను రోశయ్య శంకుస్థాపన చేసినందుకు గుర్తుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆర్యవైశ్యుల మనోభావాలను గౌరవించింది. విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించి ప్రాధాన్యం లేని ప్రాంతంలో పెట్టాలన్న కుతంత్రంతో కూటమి పార్టీ నేతలు ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. ఇక్కడ రోశయ్య విగ్రహంతో పాటు రంగారాయుడు చెరువు ముందు ఉన్న పీవీ నరశింహారావు విగ్రహాన్ని కూడా తొలగించాలన్న లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో పీవీ నరశింహారావు విగ్రహాన్ని తొలగించాలని తీర్మానంలో కూడా పెట్టారు. అయితే అప్పట్లో అది ఆమోదం పొందలేదు.

రోశయ్య విగ్రహం చుట్టూ ఫౌంటేన్ తొలగింపు అమానుషం: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్ తొలగించటం అమానుషమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో కూటమి ప్రభుత్వం చనిపోయినా రోశయ్యపై అక్కసు కక్కుతున్నారని మండిపడ్డారు. తొలుత రోశయ్య విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్‌ను తొలగించి ఆ తరువాత విగ్రహాన్నే తొలగించే కుట్రలు కూటమి నాయకులు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల అభిమాన పాత్రుడైన రోశయ్య విగ్రహాన్ని తొలగించాలనుకోవటం ద్వారా ఆ మహనీయుడ్ని చంద్రబాబు అవమానిస్తున్నారని మండిపడ్డారు.

ఒంగోలు నడిబొడ్డున ఆర్యవైశ్యుల షాపులతో దేశంలోనే అతి పెద్ద రెండో కాంప్లెక్స్‌గా, పెద్దాయన రోశయ్య శంకుస్థాపన చేసిన కాంప్లెక్స్‌గా ప్రఖ్యాతి చెందిన బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న.. రోశయ్య విగ్రహాన్ని తొలగించే దుశ్చర్యకు చంద్రబాబు ప్రభుత్వం దిగడం అన్యాయమని ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం ప్రాధాన్యత తగ్గుతుందన్న కారణంతో రోశయ్య విగ్రహాన్ని తొలగించే కుట్రకు చంద్రబాబు ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా పెద్ద పీట వేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కాదని గడిచిన ఎన్నికల్లో చంద్రబాబుకు అండగా నిలిచిన రాష్ట్ర ఆర్య వైశ్య సోదరీ సోదరులు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటల నుంచి బయట పడాల్సిన అవసరం ఎంతైనా వైశ్యులకు ఉందని హితవు పలికారు.

అగ్రిగోల్డ్ సొత్తు పచ్చదొంగల సొంతం

- రూ.లక్షల విలువైన జామాయిల్ చెట్లు నరికి తరలింపు
- పెద్ద సంఖ్యలో నెల్లూరు నుంచి కూలీలను రప్పించిన వైనం
- ఏ మాత్రం పట్టించుకోని అధికారులు


అగ్రిగోల్డ్‌కు చెందిన పొలాల్లో నరికిన జామాయిల్ చెట్లు


జామాయిల్ చెట్లు నరికే కూలీలు వేసుకున్న గుడిసెలు

యర్రగొండపాలెం: అగ్రిగోల్డ్ సొత్తును పచ్చ దొంగలు దోచుకుంటున్నారు. తమను ఎవరు అడుగుతారన్న ధైర్యంతో వారు రెచ్చిపోతున్నారు. మండలంలోని వీరభద్రాపురం పంచాయతీ పరిధిలో ఉన్న రాయవరం రెవెన్యూ మజరా గ్రామంలో అగ్రిగోల్డ్‌కు చెందిన 155 ఎకరాల భూమి ఉంది. అందులో జామాయిల్ చెట్లు పెంచారు. ఈ చెట్లు ఏపుగా పెరగడంతోపాటు ఇటీవల రైతులు బర్లీ పొగాకు ఎక్కువగా సాగు చేస్తున్నారు. పొగాకు ఆకును ఆరబెట్టేందుకు పందిర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కారణంతో ఒక్కొక్క చెట్టు రూ.450 పలుకుతుంది. అంతేకాకుండా మార్కెట్‌లో జామాయిల్ విలువ టన్ను రూ.8 నుంచి రూ.10 వేల వరకు పలుకుతుందని పలువురు రైతులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జామాయిల్‌కు అధిక ధర పలుకుతుండటంతో టీడీపీ నేతకు కన్నుకుట్టింది. వెంటనే నెల్లూరు నుంచి పెద్ద సంఖ్యలో కూలీలను రప్పించి టన్నుల కొద్దీ జామాయిల్ చెట్లను నరికించి లారీల్లో తరలించాడన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రాయవరంతో పాటు మండలంలోని వెంకటాద్రిపాలెంలో 80 ఎకరాలు, కొలుకులలో 60 ఎకరాలు, త్రిపురాంతకం మండలంలోని దూపాడులో 120 ఎకరాలు, హసనాపురంలో 1000 ఎకరాలు, కంభంపాడులో 250 ఎకరాల ప్రకారం మొత్తం 1665 ఎకరాల్లో జామాయిల్ మొక్కలను పెంచారు. అగ్రిగోల్డ్ సంస్థ వివాదాల్లో పడటంతో ఆ చెట్లను ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను సంరక్షించింది. బాధితులకు అండదండ అందించడంతోపాటు కొంత మేరకు నష్టపరిహారం కూడా అందించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అగ్రిగోల్డ్ ఆస్తులు కాపాడటంలో పూర్తిగా విఫలమైంది. ఆ సంస్థ బాధితులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ అండదండలు మెండుగా ఉన్నాయన్న పచ్చ నాయకులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంలో భాగంగా కొంతమంది అగ్రిగోల్డ్ భూముల్లో వేసిన జామాయిల్ చెట్లను నరుక్కొని సొమ్ము చేసుకుంటుంటే, మరి కొంతమంది ఆ సంస్థకు చెందిన సింగరాయ హిల్స్ గ్రీన్ పవర్‌జెన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ పేరు చెప్పుకొని భూములనే అమ్ముకుంటున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని అగ్రిగోల్డ్ ఆస్తులను రక్షించి తమకు న్యాయం చేయాలని పలువురు ఆ సంస్థ బాధితులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

అనుబంధ విభాగం	జిల్లా అధ్యక్షులు
బీసీ సెల్	బొట్ల సుబ్బారావు
లీగల్ సెల్	నగిరికంటి శ్రీనివాసరావు
డాక్టర్స్ వింగ్	చంద్రాగారి నందకిషోర్
దివ్యాంగుల విభాగం	దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి
మైనార్టీ సెల్ అధ్యక్షుడు	షేక్ సుల్తాన్
ప్రచార విభాగం	కనపర్తి శేషారెడ్డి
బూత్ కమిటీస్	పుట్టా వెంకటరావు
ఆర్టీఐ వింగ్	చింతగుంట్ల సాల్మన్
వైఎస్సార్ టీయూసీ	మిటికెల గురవయ్య
క్రిస్టియన్ మైనార్టీ సెల్	ఇసుకుల ఓబయ్య
పంచాయతీరాజ్ వింగ్	నన్నెబోయిన రవికుమార్
ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్	పల్లెబోయిన వెంకటరాజు
యువజన విభాగం	జీ శ్రీకాంత్‌రెడ్డి
ఎస్సీ సెల్	జి.దేవప్రసాద్
వాణిజ్య విభాగం	కొల్లా భాస్కర్
మహిళా విభాగం	దుంపా రమణమ్మ
రైతు విభాగం	ఎం.బంగారుబాబు
గ్రీవెన్స్ సెల్	పాలినేని కోటయ్య
చేనేత విభాగం	సోమ యానాదిశెట్టి

పంటల బీమా నమోదుకు గడువు పెంపు

ఒంగోలు సబర్బన్: పంటల బీమా నమోదుకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బివై) పథకం కొన్ని పంటలకు ఈనెల 15వ తేదీతో బీమా ప్రీమియం చెల్లించే గడువు ముగిసింది. 2024-25 సీజన్‌కుగాను వరి, శనగ, జొన్న, మినుము, మొక్కజొన్న, ఎర్ర మిరప పంటలను నోటిఫై చేసిన విషయం తెలిసిందేనన్నారు. అయితే వరి పంటకు సంబంధించి బీమా నమోదుకు ఆఖరి తేదీ ఈ ఏడాది డిసెంబర్ 31కాగా మిగిలిన ఐదు పంటల బీమా నమోదుకు డిసెంబర్ 15వ తేదీతో గడువు ముగిసిందన్నారు. అందుకుగాను రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు అనుగుణంగా భారత ప్రభుత్వం మిగతా పంటలకు కూడా బీమా నమోదు గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించిందని చెప్పారు. జిల్లాలోని రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కామన్ సర్వీస్ సెంటర్లలో (సీఎస్‌సీ) సంప్రదించి నోటిఫై చేసిన వరి, శనగ, జొన్న, మినుము, మొక్కజొన్న, ఎర్రమిరప పంటలకు కూడా ప్రీమియం చెల్లించి పంటల బీమా నమోదు చేసుకోవాలని ఆయన రైతులను కోరారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

ఒంగోలు టౌన్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు–కరవది రైల్వేస్టేషన్ల మధ్య వేగంగా వెళ్తున్న రైలు నుంచి గురువారం ఒక గుర్తు తెలియని యువకుడు జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుంది. ఎరుపు, నీలం రంగు ఫుల్ హ్యాండ్ టీ షర్ట్, నలుపు రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ఎవరైనా సమాచారం తెలిస్తే జీఆర్‌పీ ఎస్‌ఐ (9440627647)కి తెలియజేయాలని ఎస్‌ఐ టి.అరుణ కుమారి తెలిపారు.

మృతిచెందిన మహిళ వివరాలు లభ్యం

దర్శి: సాగర్ కాలువలో గత మంగళవారం లభించిన గుర్తు తెలియని మహిళ మృతదేహం వివరాలు గురువారం లభ్యమయ్యాయి. కనిగిరి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన దోరసిల చెంచయ్య భార్య గోవిందమ్మ (63)గా మృతురాలిని పోలీసులు గుర్తించారు. దర్శి సాగర్ కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైందని తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు దర్శిలోని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గోవిందమ్మ కూడా కనిపించడం లేదని తెలిపారు. ఆమె మృతదేహం ఫొటో చూసి గోవిందమ్మ అని ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని కూడా చూసి గోవిందమ్మగా నిర్ధారించుకుని తీసుకెళ్లారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది.

సైకాలజిస్ట్ పోస్టు నోటిఫికేషన్ రద్దు

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ డీఈఐసీ ప్రోగ్రాంకు సంబంధించి ఖాళీగా ఉన్న సైకాలజిస్ట్ పోస్టు భర్తీ చేసేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారిణి పి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నోటిఫికేషన్ రద్దు చేసినట్లు చెప్పారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

దొనకొండ: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ నెట్ బాల్ బాలురు, బాలికల జట్ల ఎంపిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించినట్లు నెట్‌బాల్ సెక్రటరీ ఐపీ రాజు తెలిపారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ప్రారంభించారు. ఈ ఎంపికకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి బాలురు, బాలికలు పాల్గొన్నారు. వారికి నెట్‌బాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21, 22 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఆరవల్లిపాడు వ్యాయామ ఉపాధ్యాయులు అల్లాభక్షీ పాల్గొన్నారు.

భార్యను గొడ్డలితో నరికిన భర్త



చికిత్స పొందుతున్న మరియమ్మ

మార్కాపురం: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త గొడ్డలితో నరికిన సంఘటన గురువారం మార్కాపురం పట్టణంలోని ఏకలవ్య నగర్‌లో చోటుచేసుకుంది. దోర్నాల మండలం చినగుడిపాడులో వీఆర్‌ఓగా పనిచేస్తున్న చినకొండయ్య, మరియమ్మ దంపతులు మార్కాపురం ఏకలవ్య కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే మరియమ్మపై చినకొండయ్యకు అనుమానం ఏర్పడింది. దీంతో ఇరువురి మధ్య మనస్పర్ధలు పెరిగాయి. వారం రోజుల క్రితం ఇద్దరికీ పట్టణ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన కొండయ్య ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకుని భార్య ముఖం, గొంతు, తలపై కొట్టటంతో రక్తపు మడుగులో పడిపోయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక జీజీహెచ్‌కు తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఓగా పనిచేస్తున్న కొండయ్య పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని పట్టణ ఎస్సై సైదుబాబు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

- 3 వాహనాలు, రూ.3.05 లక్షలు స్వాధీనం

మార్కాపురం రూరల్: మండలంలోని బొడిచర్ల గ్రామంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు మారువేషాల్లో దాడి చేశారు. మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై అంకమరావు, టూటౌన్ ఎస్సై రాజమోహన్, తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడు దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.3,05,800, 3 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.



చిల్లచెట్లతో నిండిన పిల్లల పార్కు



నిర్వహణ లేని ఫౌంటెయిన్



నిరుపయోగంగా స్విమ్మింగ్ పూల్

శిథిలావస్థలో కాటేజీలు





రావొద్దమ్మా.. ఇట్లు మీ గుండ్లకమ్మ!

అలసి సొలసిన మనసులకు కాస్త ఆహ్లాదం.. పిల్లలకు ఆటవిడుపు కలిగించే పర్యాటక ప్రాంతం కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్. మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో వైఎస్సార్ నిర్మించిన ఈ రిజర్వాయర్ వద్ద ప్రస్తుతం కనీస వసతులు కరువయ్యాయి. డ్యామ్ పరిసరాల్లోని రిసార్ట్ భవనాలు శిథిలమయ్యాయి. పిల్లల పార్కు చిట్టవిడిని తలపిస్తుండగా, స్విమ్మింగ్ పూల్ నిర్వహణను గాలికొదిలేశారు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ వద్ద కనీస వసతులు కల్పించి పర్యాటకాన్ని ప్రోత్సహించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

– సాక్షి, ఒంగోలు



దెబ్బతిన్న కాటేజ్ తలుపు



చిల్లులు పడిన పైకప్పు



పగిలిన కిటికీ అద్దాలు



శిథిలావస్థలో చెట్ల కింద ఉన్న బోట్లు



తాళం వేసిన టూరిజం బోటింగ్ యూనిట్ ఆఫీస్

కీచక టీచర్‌పై చర్యలు తీసుకోండి

- ఎంఈఓకు పడమరనాయుడుపాలెం గ్రామస్తుల ఫిర్యాదు
- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తనే కారణం



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న పీఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు

కురిచేడు: మండలంలోని పడమరనాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై ఎంఈఓకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పాఠశాల తనిఖీకి వెళ్లిన ఎంఈఓ వస్త్రాంనాయక్‌కు పీఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు గ్రామస్తులు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విద్యార్థినులపై చేతులు వేస్తూ ఇళ్ల వద్ద చెబితే సర్టిఫికెట్లు ఇవ్వనని బెదిరించాడని, కొందరికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలలో తోటి ఉపాధ్యాయినులతోనూ అసభ్యంగా ప్రవర్తించడంతో వారు బయటకు చెప్పుకోలేక బదిలీ చేయించుకుని వెళ్లిపోయారని ఎంఈఓ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోనే ఉంటూ చదువుకుంటారని ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపుతున్నామని, ఉపాధ్యాయుడి నిర్వాకం చూశాక పిల్లలను బడికి ఎలా పంపగలమని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పరువు పోతుందని భయపడి ఎవరికి వారు విషయాన్ని గోప్యంగా ఉంచడంతో ఆ ఉపాధ్యాయుడు అవకాశంగా మలుచుకుని దారుణంగా ప్రవర్తించాడని వివరించారు. చివరకు విషయం బయటకు పొక్కడంతో గత 25 రోజులుగా సెలవుపై వెళ్లాడని, అతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎంఈఓను కోరారు.

సోమ, గురువారాలు సదరం సర్టిఫికెట్లు జారీ

ఒంగోలు టౌన్: పెన్షన్ స్కీం కోసం ఒంగోలులోని జీజీహెచ్‌లో సోమ, గురువారాల్లో సదరం సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున తెలిపారు. ఆ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పక్షవాతంతో బాధపడుతూ మంచంపట్టిన, వీల్‌చైర్‌కు పరిమితమైన వ్యక్తులు 10వ నంబర్ ఓపీలో, తీవ్రమైన కండరాల క్షీణత, ప్రమాదాల బారినపడి వెన్నుపూస సమస్యలతో మంచానికి పరిమితమైన వ్యక్తులు ఓపీ నంబర్ 112లో సోమ, గురువారాలు వైద్యులను సంప్రదించాలని సూచించారు. సదరం స్లాట్ బుక్ చేసుకున్న రసీదు, ఆధార్ కార్డులను వెంట తీసుకెళ్లాలన్నారు. సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చేవారు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, నేరుగా ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. సదరంకు సంబంధించిన వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు నేషనల్ సౌత్ జోన్ స్థాయి కబడ్డీ పోటీలు

గిద్దలూరు రూరల్: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో సెయింట్ జాకబ్ పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 21వ తేదీన సౌత్ జోన్ ఇండియా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నోవెల్, బి.చార్లెస్, రాబర్ట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ఏపీడీలు, ఏపీఓలతో పారిశుధ్య పనులు, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై వచ్చే ఫిర్యాదులను అదేరోజు పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సంక్రాంతి నాటికి క్యాటిల్ షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు ప్రతి పంచాయతీలో ఒక చెరువును గుర్తించాలన్నారు. కమ్యూనిటీ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీఓ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యుత్ జేఏసీ చైర్మన్ సంజీవరావు

ఒంగోలు సబర్బన్: ఉత్తరప్రదేశ్, ఛండీఘర్ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నాయని విద్యుత్ యూనియన్ల జేఏసీ ధ్వజమెత్తింది. ఆ మేరకు స్థానిక రామ్‌నగర్‌లోని విద్యుత్ భవన్ ముందు గురువారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచగర్ల సంజీవరావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, ఛండీఘర్ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్న తీరును తప్పుపడుతున్నామన్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకిస్తున్నామని మండిపడ్డారు. సేవ్ పవర్ సెక్టార్, సేవ్ ఇండియా అంటూ నినాదాలు చేశారు. విద్యుత్ సవరణ చట్టం 2022ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మొండివైఖరిని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు. డిస్కం ఫీడర్లను ప్రైవేటుకు ఇచ్చే ఆలోచనలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారులకు డీబీటీ విధానం సాధ్యం కాదన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ హరిబాబు, రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్ కేవీ రవి, ఎస్.జయకర్, వీఎల్ నరసింహారావు, సీహెచ్ కాంతారావు, ఏవీ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనతో పేదరిక నిర్మూలన

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా సమాజంలో పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఆ లక్ష్యం సాధించేలా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం చేశారు. గురువారం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై గ్రీవెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలో భాగంగా 10 ప్రత్యేక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జిల్లాలోని పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ఆయా అంశాల్లో అర్హులకు అవసరమైన ప్రభుత్వ సహాయం అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పింఛన్ల పంపిణీ అదేరోజు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. దీనిలో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం ప్రకారం ఒక కూల్‌డ్రింక్ షాపు ఏజెన్సీ నిర్వహిస్తున్న పుల్లి ఉమామహేశ్వర్‌రెడ్డి(60) తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నామని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి కేసులో కేసు నమోదు

కొమరోలు: గొడ్డలితో మహిళలపై దాడి చేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లుగా కొమరోలు ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన పొలం వివాదం నేపథ్యంలో మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన జెడ్పీ హైస్కూల్ సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ పకీరయ్య, అతని కుమారుడు సాయి అదే ఊరికి చెందిన తోడికోడళ్లు లక్ష్మీదేవి, రమాదేవి గొడ్డలితో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలి



అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఒంగోలు టౌన్: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని, పార్లమెంటు సాక్షిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి బి.రఘురాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పార్లమెంటు సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించడమంటే సాక్షాత్తు రాజ్యాంగాన్ని, దేశభక్తులను అవమానించినట్లే అని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి ఎన్నికైన మంత్రి రాజ్యాంగ నిర్మాతను కించపరచడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ సంఘటనను దేశ ప్రజలంతా ఖండించాలని కోరారు. సమాజంలో సర్వసమానతను కాంక్షించి అనేక పోరాటాలు చేసిన మహనీయుడు అంబేద్కర్‌పై నోరు పారేసుకోవడం అమిత్‌షా దురహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. నిరసనలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలకోటయ్య, రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు మంచిగులపాటి శ్రీను, డీ వైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కె.రమాదేవి, చీకటి శ్రీనివాసరావు, కరిముల్లా, తిరుపతి రావు, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రికవరీ చేయకుండా ఈగలు తోలుతున్నారా..?

- రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి గురువారం పరిశీలించారు. నగరంలో జరిగిన సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన చైర్‌పర్సన్ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన రుణాల రికవరీపై ఈడీ అర్జున్ నాయక్‌ని ప్రశ్నించారు. రుణాల రికవరీ నత్త నడకన సాగుతుండటంతో ఈగలు తోలుకుంటున్నారా అని ఈడీని ప్రశ్నించారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కేంద్ర నిధుల ద్వారా 537 మంది నుంచి రూ.17 కోట్లకు పైగా రుణాల రికవరీని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాల్లో అనర్హులు ఉన్నారని, రెంట్‌ను పెంచుతామన్నారు. కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరుపయోగంగా ఉన్న డ్రైన్ క్లీనింగ్ యంత్రాల ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. త్వరలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు మంజూరవుతాయని తెలిపారు.

రెడ్ క్రాస్ ఎన్నికలపై హైకోర్టు స్టే

ఒంగోలు టౌన్: ఈ నెల 22వ తేదీన జరగాల్సిన రెడ్ క్రాస్ ఎన్నికలను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల చైర్మన్ తో సహా మరో నలుగురు రాజీనామా చేయడం తెలిసిందే. దీంతో కమిటీని రద్దు చేసి స్టెప్ సీఈఓ శివన్నారాయణకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలు నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాలు రెడ్ క్రాస్ బైలా ప్రకారం చెల్లవని ఆ సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి కోర్టుకు వెళ్లారు. చైర్మన్ రాజీనామా చేయడంతో బైలా ప్రకారం ఆయన చైర్మన్ అయ్యారు. ప్రసన్న రాజు కోశాధికారి అయ్యారు. ఈ కమిటీని కొనసాగిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిడితోనే...

రెడ్ క్రాస్ కమిటీ ఎన్నిక 2022 మార్చిలో జరిగింది. పాలకవర్గానికి ఇంకా మూడున్నర నెలల సమయం ఉంది. అయితే ప్రస్తుత పాలకవర్గం వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్నికైంది కనుక రాజీనామా చేయించి టీడీపీ నేతలకు పదవులు కట్టబెట్టాలని ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిడి చేసినట్లు సమాచారం. అంతేకాకుండా 14 మంది పేర్లను తయారుచేసి కలెక్టర్‌కు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అలా నియమించడం కుదరదని తేల్చి చెప్పిన కలెక్టర్ ఎన్నికలకు ఆదేశాలు ఇచ్చినట్లు అధికార వర్గాల్లో వినిపిస్తోంది. రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని రెడ్ క్రాస్ లో టీడీపీ పాగా వేయాలని ప్రయత్నించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.